సాక్షి నల్లగొండ

శనివారం । 9 । సెప్టెంబర్ । 2023



ప్రాజెక్టు పనుల్లో ప్రమాదం

సుంకిశాల ఇన్‌టేక్‌వెల్ పంపింగ్ స్టేషన్ పనుల వద్ద జరిగిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఐదుగురు గాయపడ్డారు. - 10లో



మాటలకు, చేతలకు..

సీఎం కేసీఆర్ మాటలకు, చేతలకు పొంతన ఉండదని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. - 10లో



రాష్ట్ర మిల్లులకు నో చాన్స్

కొత్త నిబంధన కారణంగా మిల్లుల వద్ద ఉంచిన ధాన్యాన్ని రాష్ట్ర మిల్లులే కొనుగోలు చేసే అవకాశం లేకుండా పోయింది. - 12లో

న్యూస్‌రీల్

రేషన్‌షాపుల్లో నిబంధనలు పాటించాలి



కొండమల్లేపల్లిలోని రేషన్‌షాపును తనిఖీ చేస్తున్న అధికారులు

కొండమల్లేపల్లి : రేషన్ డీలర్లు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ సీఎస్ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని పలు రేషన్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణం నంబర్ 4లో 6.5 క్వింటాళ్ల రేషన్ బియ్యం, షాప్ నంబర్ 5లో 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం అదనంగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు సెక్షన్ 6ఏ కింద ఆయా రేషన్ దుకాణాలను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో రిటైర్డ్ తహసీల్దార్ కమల్ పాషా, సివిల్ సప్లయీస్ ఎస్‌ఐ పుల్లయ్య, బ్రహ్మచారి, పెద్దవూర డీటీ సీఎస్ ఎండీ.ముక్తార్ తదితరులున్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి బీబీఏ ఈ కామర్స్‌లో ఖాళీగా ఉన్న 2 అధ్యాపక పోస్టులకు గెస్ట్ లెక్చరర్లుగా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యాం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. పీజీలో 55 శాతం మార్కులు కలిగి ఉండి, నెట్, సెట్, పీహెచ్‌డీతో పాటు బోధన అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 16వ తేదీ వరకు ఎన్జీ కళాశాలలో సమర్పించాలని, 20వ తేదీన నిర్వహించే ఇంటర్వ్యూలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని సూచించారు.

విదేశాలకు తపాలా 'పార్శిల్' సేవలు

నార్కట్‌పల్లి : తపాల శాఖ ఏర్పాటు చేసిన డాక్ నిర్యాత్ సేవా కేంద్రాల ద్వారా విదేశాలకు అతి తక్కువ ధరలకే పార్శిల్స్ పంపించే ఏర్పాటు చేసినట్లు ఆ శాఖ నల్లగొండ నార్త్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు. శుక్రవారం నార్కట్‌పల్లి పోస్టాఫీసులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశాల్లో ఉంటున్న తమ బంధుమిత్రులకు తపాలా సేవా కేంద్రాల ద్వారా వస్తువులను సులువుగా, తక్కువ ధరకే పంపించే అవకాశం ఉందన్నారు. విదేశాలకు పంపే పార్శిల్స్‌కు కస్టమ్స్ శాఖ నుంచి వేగంగా క్లీయరెన్స్ లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సబ్ పోస్ట్‌మాస్టర్ పాపారావు, మల్లారెడ్డి, పరమేష్ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్షలు



దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

నల్లగొండ : సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన రిలే దీక్షలు ఐదవ రోజు శుక్రవారం కొనసాగాయి. దీక్షకు పీఆర్టీయూ, బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డీవీఎస్.ఫణికుమార్, కాలం నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యాశాఖలో భాగమైన సమగ్ర శిక్షలో పనిచేస్తున్న 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా కాంట్రాక్టు ఉద్యోగ సంఘం అధ్యక్షుడు తిరందాసు సంతోష్ కుమార్, కామనబోయిన కేశవులు, పగిడిపాటి ప్రవీణ్, రమేష్ కుమార్, రవి, గిరిధర్, చంద్రశేఖర్, బంటు వెంకన్న, చంద్రమౌళి, కేసాని లక్ష్మి, చందపాక నాగరాజు, శంకర్, వెంకట క్రిష్ణ, మంజుల, పుష్పాలత, సంధ్య, విజయ, ప్రవళిక, బీఎస్పీ నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యార్థినుల మృతికి కారకులను శిక్షించాలి

నల్లగొండ టూటౌన్ : ఉమెన్స్ కాలేజీలో చదువుతున్న విద్యార్థినులు శివాని, మనీషా మృతికి కారణమైన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరుతూ ఫోరమ్ ఫర్ హ్యూమన్ రైట్స్ అండ్ సోషల్ జస్టిస్ ప్రతినిధులు గురువారం ఎస్పీ అపూర్వరావు, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. విద్యార్థుల ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్, సోషల్ మీడియా డేటాను లోతుగా పరిశీలించి వేధింపులకు గురిచేసి వారిని గుర్తించి చట్ట ప్రకారం శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో పాడిచేటి ప్రభాకర్‌గౌడ్, ఎండీ.ఫిరోజ్, కె.విజయ్‌కుమార్, కె.వెంకటేశ్వర్లు, టి.యాదయ్య, ఎండీ.హనీఫ్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

బ్లాక్‌లో యూరియా!

బస్తాపై రూ. 80 నుంచి రూ.100 వరకు అదనంగా వసూళ్లు

- ఇటీవల కురిసిన వర్షాలతో యూరియాకు పెరిగిన డిమాండ్
- దానిని సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు
- గుళికలు, పురుగు మందులు కూడా కొనాలని మెలిక
- డీసీఎంఎస్, సహకార సంఘాల ఎదుట రైతుల బారులు



నల్లగొండలోని డీసీఎంఎస్ ఎదుట యూరియా కోసం బారులుదీరిన రైతులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలో యూరియా బ్లాక్ దందా మొదలైంది. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకున్న వ్యాపారులు ఒక్కో యూరియా బస్తాపై రూ.80 నుంచి రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. వారు అడిగిన ధరకు తీసుకోకుంటే యూరియా లేదనే సమాధానం చెబుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో ఒకేసారి డిమాండ్ పెరగడంతో ఎక్కువ మొత్తంలో యూరియాను కొనుగోలు చేసేందుకు రైతులు దుకాణాలు, కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. మరోవైపు గులికలు, ఇతర కాంప్లెక్స్ ఎరువులు, పురుగుల మందులు కొంటేనే యూరియాను అమ్ముతామని మెలిక పెడుతుండటంతో రైతులపై అదనపు భారం పడుతోంది.

పత్తి, వరికి ఒకేసారి డిమాండ్..

జిల్లా వ్యాప్తంగా వానాకాలంలో ఇప్పటి వరకు 4,96,013 ఎకరాల్లో వరి సాగు చేయగా, 5,74,300 ఎకరాల్లో పత్తిపంటను రైతులు సాగు చేశారు. దీంతో పాటు కంది, వేరుశనగ తదితర పంటలను కూడా సాగు చేశారు. ప్రస్తుత వానాకాలంలో వర్షాల్లేక వరిసాగు కొంత ఆలస్యమైంది. జూలైలో కాస్త వర్షాలు కురిసినా ఆగస్టులో వర్షాల జాడలేకుండా పోయింది. ఆలస్యంగా వేసిన వరి ప్రస్తుతం కలుపు తీసి యూరియా వేసుకునే దశలో ఉండగా, పత్తి పూత దశలో ఉంది. ఈ పరిస్థితుల్లో ఈనెల ప్రారంభం నుంచి ఉపరితల ఆవర్తనం కారణంగా జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిశాయి. పత్తి, ఇతర పంటలతో పాటుగా వరికి కూడా ప్రాణం పోసినట్లయ్యింది. పత్తిచేలకు మంచి అదును కావడంతో యూరియాకు పెద్ద ఎత్తున డిమాండ్ ఏర్పడింది. దీంతో ఒక్కో బస్తాను రూ.266కు విక్రయించాల్సి ఉండగా, కొందరు వ్యాపారులు రూ.370 వరకు వసూలు చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు.

మొదట్లో పెద్దగా కొనుగోలు చేయని రైతులు..

ఈ సీజన్‌లో ఏప్రిల్ నుంచి నెల వారీగా ఆగస్టు వరకు కేటాయింపుల మేరకు యూరియా సరఫరా అయ్యింది. మొదట్లో వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు పెద్దగా యూరియాను కొనుగోలు చేయలేదు. జిల్లాకు ఇప్పటి వరకు 80,108 మెట్రిక్ టన్నుల యూరియా రావాల్సి ఉండగా, ఆగస్టు వరకు వరకు 70 వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు వచ్చినట్లు తెలిసింది.

గుళికలకు మెలిక..

జిల్లాలోని పలు ప్రైవేట్ దుకాణాల వ్యాపారులతో పాటుగా నాగార్జున జిల్లా మార్కెటింగ్ సహకార సొసైటీ ఏజెన్సీల్లోనూ రైతులు యూరియాను కొనుగోలు చేయడం కోసం వెళ్తే గుళికలు, ఇతర కాంప్లెక్స్ ఎరువులు, పురుగుల మందులు కొనాలని మెలిక పెడుతున్నారని రైతులు అంటున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రతీక్‌మెమోరియల్ జూనియర్ కళాశాల ఎదురుగా, నల్లగొండ మండల పరిధిలోని చందనపల్లి, ఎస్ఎల్‌బీసీలోని డీసీఎంఎస్ ఏజెన్సీల్లో యూరియా నిల్వలు ఉన్నప్పటికీ గులికల మెలిక కారణంగా సమీప గ్రామ రైతులు అక్కడ యూరియాను కొనడం లేదు. జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్‌లోనే కొనడానికి రైతులు బారులుదీరుతున్నారు. దీంతో శుక్రవారం ఒక్కరోజే అధికారులు ఐదు లారీల యూరియాను తెప్పించి రాత్రి వరకు మూడు లారీల యూరియాను రైతులకు విక్రయించారు. మిర్యాలగూడ, చండూరు, మునుగోడు, హాలియా ప్రాంతాల్లోనూ డిమాండ్‌కు అనుగుణంగా యూరియా అందుబాటులో ఉంచకపోవడంతో రైతులు సహకార సంఘాల కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నారు.

ఉదయం నుంచే బారులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం వద్ద యూరియా కోసం కోసం రైతులు శుక్రవారం ఉదయం నుంచే బారులుదీరారు. అక్కడికి వచ్చిన రైతుల పట్టాదారు పాస్ పుస్తకాల వివరాలు నమోదు చేసుకుని రెండు, మూడు బస్తాల చొప్పున మాత్రమే యూరియా అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సీఈఓ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ మూడు లారీల యూరియాకు డీడీలు పంపగా శుక్రవారం నాటికి ఒక లారీ (440 బస్తాలు) యూరియా మాత్రమే వచ్చిందని తెలిపారు. మిగతా రెండు లారీల యూరియా వచ్చాక రైతులకు అందజేస్తాం.



కొండమల్లేపల్లిలోని సహకార సంఘం ఎదుట బారులుదీరిన రైతులు

వర్షాలతో ఒకేసారి డిమాండ్



సెప్టెంబర్‌లో కురిసిన వర్షాల కారణంగా పత్తి, వరి పంటకు ఒకేసారి యూరియా వేసుకునేందుకు అదును కావడంతో యూరియాకు డిమాండ్ పెరిగింది. యూరియా కొరత లేదు. రైతులు పంటలకు అవసరం మేరకే యూరియా వేయాలి. ఎక్కువ మోతాదులో వేసినా తెగుళ్ల ఆశించే ప్రమాదం ఉంది.

– పాల్వాయ్ శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి

మూడు రోజులుగా తిరుగుతున్నా..



నాకున్న మూడెకరాల్లో ఒకసారే యూరియా చల్లాను. రెండోసారి వేసేందుకు యూరియా కోసం మూడు రోజులుగా తిరుగుతున్నా. అందుబాటులో ఉన్నా లేదని చెబుతున్నారు.

– భూక్యా శ్రీనివాస్, లక్ష్మీపురం

యూరియా ఇప్పించండి



నాలుగెకరాల్లో వరి సాగు చేశాను. నాలుగు బస్తాల యూరియా కోసం మూడు రోజులుగా తిరుగుతున్నా అధికారులు ఇవ్వడం లేదు. ఎలాగైనా యూరియా ఇప్పించండి.

– నూనావత్ బీలా, కురియాతండా

యూరియా దొరకడం లేదు..




పత్తి, వరికి మూడు బస్తాల యూరియా కావాలి. దానికోసం మూడు రోజులుగా డీసీఎంఎస్ ఆఫీస్‌కు వస్తున్నా. లోడ్ వస్తున్నా రైతులు ఎక్కువ మంది వస్తుండడంతో దొరకడం లేదు.

– పరమేశ్, అప్పాజిపేట

ఉపాధ్యాయ ఖాళీలు 219

- డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- ఈ నెల 20వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ
- ఈసారి ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు



నోటిఫికేషన్‌లో ఖాళీ పోస్టులు ఇలా	
స్కూల్ అసిస్టెంట్లు	86
భాషా పండితులు	25
వ్యాయామ ఉపాధ్యాయులు	6
సెకండరీ గ్రేడ్ టీచర్లు	102
మొత్తం	219

నల్లగొండ : ఉపాధ్యాయ నియమకాలకు నోటిఫికేషన్ విడుదలైంది. జిల్లాలో మొత్తం 219 పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. ఈనెల 20వ తేదీ నుంచి అక్టోబర్ 21వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నవంబర్ 20 నుంచి 30వ తేదీ వరకు కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్టీ) విధానంలో పరీక్షలు జరగనున్నాయి. చాలా కాలంగా బీఈడీ, టీటీసీ పూర్తి చేసి టెట్ క్వాలిఫై అయిన అభ్యర్థులు ఉపాధ్యాయ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. కానీ పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడంపై నిరుద్యోగులు నిరాశ చెందుతున్నారు.

2017లో టీఆర్టీ నిర్వహణ..

తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2017లో టీఆర్టీ ద్వారా ఉపాధ్యాయల ఖాళీలను భర్తీ చేసింది. అప్పటినుంచి ఐదేళ్లగా ఉపాధ్యా నియామకాలు చేపట్టలేదు. ఇటీవల డీఎస్సీ ద్వారా పోస్టులు భర్తీ చేస్తామని రాష్ట్ర విద్యాశాఖ చెప్పింది. ఆ ప్రకారమే పోస్టులను భర్తీ చేయనున్నారు. దీనికి కలెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. డీఎస్సీ రాసేందుకు అర్హత సాధించడం కోసం ఈ నెల 15న టెట్ నిర్వహించనున్నారు. డీఎస్సీ ద్వారా ఖాళీ పోస్టులను వర్టికల్ రిజర్వేషన్ విధానం ద్వారా భర్తీ చేస్తారా లేదా హారిజంటల్ రిజర్వేషన్ పద్ధతిన నింపుతారా తెలియాల్సి ఉంది. దీనిపై త్వరలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఎన్జీ కళాశాల స్థలం సర్వే

రామగిరి(నల్లగొండ) : సుదీర్ఘ కాలం నుంచి కోర్టు వివాదంలో ఉన్న నల్లగొండ ఎన్జీ కళాశాల స్థలాన్ని ఏడీ శ్రీనివాసులు నేతృత్వంలో అధికారులు శుక్రవారం సర్వే నిర్వహించారు. ఎన్జీ కళాశాలకు చెందిన సర్వే నంబర్ 837లో 4,383 గజాల పట్టా భూమి ఉందని ఎర్ర జనార్దన్‌రావు, ఎర్ర ప్రకాష్, చంద్రమౌళి, సుందర్‌రావు, యూసుపుద్దీన్ 1983లో నల్లగొండ కోర్టును ఆశ్రయించారు. 1991లో నల్లగొండ సీనియర్ సివిల్ కోర్టు 837 సర్వే నంబర్‌లో ప్రభుత్వ స్థలం లేదని పట్టా భూమి ఉందని తీర్పు వెల్లడించింది. దీనిపై ఎన్జీ కళాశాల యాజమాన్యం 1992లో హైకోర్టులో అప్పీలు చేయగా జిల్లా కోర్టు తీర్పు ప్రకారం ప్రభుత్వ భూమి కాదని పట్టా భూమి అని 2012 తీర్పు వచ్చింది. 2013లో నల్గొండ సీనియల్ సివిల్ కోర్టులో ఎగ్జిక్యూటివ్ పిటిషన్ వేశారు. 2015 నల్లగొండ సీనియర్ సివిల్ కోర్టు భూమిని గుర్తించి అప్పగించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. 2016 ఎన్జీ కళాశాల యాజమాన్యం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేసింది. 2018లో ఆర్డీఓ సర్వే చేయాలని కోర్టు ఆదేశించగా సర్వే చేసిన అధికారులు స్థలాన్ని నిర్ధారించలేకపోయారు. దీంతో మళ్లీ కోర్టును సంప్రదించగా ఏడీ సర్వే చేయాలని 2018లో కోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు శుక్రవారం సర్వే చేసిన అధికారులు 15 రోజుల్లో కోర్టుకు రిపోర్టును సమర్పిస్తామని తెలిపారు.



సర్వే పత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

సమస్యలు పట్టించుకోని పార్టీలను ఓడించాలి




అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : ప్రజా సమస్యలను పట్టించుకోని పార్టీలను ఓడించి తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పేర్కొన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరిగిన ధరలతో ప్రజలు అల్లాడుతుంటే.. ప్రజల దృష్టిని మళ్లించేందుకు దేశం పేరు మార్పు అంశాన్ని తీసుకొచ్చారని మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించాలని ప్రజలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోకుండా ఏదో మార్పు చేసినట్లు రాజకీయంగా లబ్ధి పొందాలని చూడడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలన్నీ సొంత పార్టీ కార్యకర్తలకే అందజేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, మంగారెడ్డి, పోలెబోయిన వరలక్ష్మి, రెమడాల పరశురాములు, రామ్మూర్తి, శశిధర్‌రెడ్డి, అంజద్, పాదూరి గోవర్ధని, శ్రీనివాస్, సైదులు, శ్రీను, సైదమ్మ పాల్గొన్నారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కేతేపల్లి : మూసీ ప్రాజెక్ట్‌కు ఎగువ ప్రాంతాల నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో శుక్రవారం అధికారులు ప్రాజెక్ట్ నాలుగు క్రస్ట్ గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. హైదరాబాద్‌తో పాటు మూసీ ఎగువ ప్రాంతాల్లో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు తగ్గుముఖం పట్టడంతో మూసీకి వస్తున్న ఇన్‌ఫ్లో కొంత తగ్గింది. గురువారం 10 వేలు క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో శుక్రవారం నాటికి 7వేల క్యూసెక్కులకు తగ్గింది. దీంతో గురువారం పైకెత్తి ఉంచిన ఐదు గేట్లలో ఒక గేటును మూసివేశారు. నాలుగు గేట్లను మూడు అడుగుల మేర పైకెత్తి 5,650 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్ట్ కుడి, ఎడమ కాల్వలకు 3,37 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 645 (4.46 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 643.70 (4.12 టీఎంసీలు) అడుగులుగా ఉందని ప్రాజెక్ట్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.



గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

నల్లగొండ : వినాయక చవితి, మిలాదున్‌నబీ పండుగలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ కోరారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో శాంతి సంఘం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంగా ఒకరి పండుగలు, ఆచారాలను వేరొకరు గౌరవించాలన్నారు. వినాయక చవితి, మిలాదున్ నబీ పండుగలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. గణేష్ నిమజ్జనం ఏర్పాట్లు, ఇతర శాఖల అధికారులను సమన్వయ పరిచే బాధ్యత అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చూడాలని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే వదంతులపై అప్రమత్తంగా ఉండాలని, అసత్య వార్తలను నమ్మి ప్రచారం చేయవద్దని కోరారు. సోషల్ మీడియాలో మతాలు, వ్యక్తులను కించపరుస్తూ పోస్టులు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నిమజ్జనం తేదీ నిర్ణయించి జిల్లా వ్యాప్తంగా ఒకే రోజున జరిగేలా చొరవ చూపాలన్నారు. ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ గణేష్ విగ్రహాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలన్నారు. ప్రతి గణేష్ మండపాన్ని జియో టాకింగ్ ద్వారా అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, ఆర్డీఓలు రవి, చెన్నయ్య, మున్సిపల్ కమిషనర్ రమణాచారి, హఫీజ్ ఖాన్, గోలి మధుసూదన్‌రెడ్డి, సలీం, పిచ్చయ్య, నర్సిరెడ్డి, హషం, గౌస్ మొయినుద్దీన్, నేతి రఘుపతి, మామిడి శ్రావణ్ పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ : డెంగీ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డెంగీ కేసులు పెరుగుతున్నందున డాక్టర్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. డాక్టర్లు తగిన ప్రణాళిక ప్రకారం టీం వర్క్ చేయాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

మూన్నెళ్లుగా.. తూకం వేయకుండానే!

- డీలర్లకు రేషన్ బియ్యం సరఫరా చేస్తున్న సివిల్ సప్లయ్ శాఖ
- వేలిముద్రలు తీసుకొని రేషన్ ఇస్తున్న గోదాము ఇన్‌చార్జిలు
- బియ్యం తక్కువగా వస్తున్నాయని డీలర్ల ఆవేదన



జిల్లాలో రేషన్ షాపులు	991
ఆహార భద్రతకార్డులు	4,66,529
రేషన్ లబ్ధిదారులు	13,96,933

నల్లగొండ: రేషన్ షాపులకు బియ్యం తూకం వేసి ఇవ్వాలన్న ప్రభుత్వ ఆదేశం ఇంకా అమలుకు నోచుకోవడం లేదు. మూడు మాసాల క్రితం ప్రభుత్వం రేషన్ డీలర్ల విజ్ఞప్తి మేరకు మండల లెవల్ స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల నుంచి రేషన్ షాపులకు ఇచ్చే బియ్యం తూకం వేసి ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే గోదాముల్లో అందుకు అనుగుణంగా కాంటాలు లేవన్న సాకుతో తూకం వేయకుండానే డీలర్లకు బియ్యం ఇస్తున్నారు. దీంతో ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలు మూడు నెలలుగా అమలుకు నోచుకోని పరిస్థితి నెలకొంది. ఫలితంగా బస్తాల్లో బియ్యం తక్కువగా వస్తున్నాయని, తాము తీవ్రంగా నష్టపోతున్నామని డీలర్లు వాపోతున్నారు.

అమలుకాని ఆదేశాలు..

2015 నుంచి ప్రభుత్వం రూపాయి కిలో చొప్పున కార్డుదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తోంది. అయితే కరోనా నుంచి రేషన్ కార్డుదారులందరికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంతో ఉచితంగా బియ్యం పంపిణీ చేస్తున్నాయి. రేషన్ షాపులకు ఎంఎల్ఎస్ గోదాముల నుంచి ప్రతినెలా బియ్యం పంపిణీ అవుతుంటాయి. అయితే ఆ బియ్యాన్ని గోదాముల వద్ద ఏ డీలర్‌కు ఎన్ని క్వింటాళ్లు ఇవ్వాలనేది అక్కడే తూకం వేసి ఇవ్వాలి. అందు కోసం అక్కడ ఎలక్ట్రానిక్ తూకం యంత్రాలను కూడా ఏర్పాటు చేశారు. కానీ ఆ యంత్రం 25 క్వింటాళ్ల వరకే తూకం వేయడానికి వీలవుతుంది. దీంతో ఒక డీలర్‌కు 70 క్వింటాళ్లకు పైగానే బియ్యం ఇవ్వాల్సి ఉంటుంది. కాబట్టి 2, 3 సార్లు తూకం వేయాల్సి ఉంటుందన్న సాకుతో 50 కిలోల బస్తాను లెక్క కట్టి ఆయా డీలర్లకు తూకం వేయకుండానే బియ్యం పంపుతున్నారు. అందులో ఒక్కో డీలర్‌కు క్వింటాళ్ల కొద్ది బియ్యం తక్కువగా వస్తున్నాయి. దీంతో తాము నష్టపోతున్నామని ఏళ్ల తరబడి డీలర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తూ వస్తున్నారు. అయితే మునుగోడు ఉప ఎన్నికల సందర్భంలో డీలర్ల సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి పోగా కేటీఆర్ పరిష్కరిస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. ఎన్నికల తరువాత రేషన్ డీలర్ల సంఘం నేతలతో హైదరాబాద్‌లో సమావేశం నిర్వహించి సమస్యలను అడిగితెలుసుకున్న సందర్భంలో తూకం వేసి బియ్యం ఇవ్వాలని మంత్రి కేటీఆర్ ఆదేశించారు. దీంతో జూలై మాసం నుంచే డీలర్లకు బియ్యం తూకం వేసి ఇవ్వాల్సి ఉన్నా ఆదేశాలు అమలు చేయడం లేదు.

పాత పద్ధతిలోనే పంపిణీ..

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చినా గోదాముల్లో డీలర్లకు బియ్యం తూకం వేసి ఇవ్వడం సాధ్యం కావడం లేదని పాత పద్ధతిలోనే బస్తాల చొప్పున లెక్కగట్టి అప్పగిస్తున్నారు. అయితే మొదట బయట తూకం వేసుకునేందుకు అవకాశం ఇచ్చినా అదీ సాధ్యం కాకపోవడంతో పాత పద్ధతినే తిరిగి బియ్యం పంపుతున్నారు. పైగా పౌరసరఫరాల అధికారులు బఫర్ గోదాముల నుంచి ఎంఎల్ఎస్ పాయింట్లకు బియ్యం తూకం వేసి ఇవ్వడం లేదని మేముకూడా ఇవ్వలేమని, పైగా గోదాముల్లో ఉన్న చిన్న మిషన్ల మీద తూక వేసి ఇవ్వాలంటే హమాలీలకు పనిభారం పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. దీంతో డీలర్లు గోదాములకు వెళ్లి వేలిముద్ర వేసి తూకం లేకుండానే పాత పద్ధతిలోనే బియ్యం తీసుకుంటున్నారు.

క్లుప్తంగా

పాము కాటుతో వ్యక్తి మృతి


దంజిలాల్ (ఫైల్)

కొండమల్లేపల్లి: మండలంలోని గన్యానాయక్‌తండాలో శుక్రవారం తెల్లవారుజామున పాముకాటుతో వ్యక్తి మృతి చెందాడు. తండాకు చెందిన రమావత్ దంజిలాల్(35) పీజీ వరకు చదివి ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో తన పొలంలో కోళ్ల ఫారం ఏర్పాటు చేసుకొని భార్య, పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం తెల్లవారుజామున కోళ్ల ఫారంలో పని చేస్తుండగా పాముకాటుకు గురయ్యాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


షేక్ రహీం (ఫైల్)

నడిగూడెం: మండలంలోని వల్లాపురంలో శుక్రవారం ఓ వ్యక్తి ద్విచక్ర వాహనానికి వాటర్ సర్వీసింగ్ చేస్తుండగా విద్యుత్ తీగ తగిలి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వల్లాపురానికి చెందిన షేక్ కాశీం, జైనాభీల చిన్న కుమారుడు షేక్ రహీం (33) గ్రామంలో ఐదు సంవత్సరాలుగా బైక్ మెకానిక్ షాపు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం ద్విచక్ర వాహనానికి వాటర్ సర్వీసింగ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగలడంతో విద్యుత్‌ఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సోని, కుమార్తె ఉంది. మృతుడికి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాహనం అదుపుతప్పి వృద్ధుడు మృతి

మాడుగులపల్లి: మండలంలోని ఇందుగుల గ్రామ శివారులో శుక్రవారం టీవీఎస్ మోపెడ్ అదుపుతప్పి వృద్ధుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఇందుగుల గ్రామానికి చెందిన గీత కార్మికుడు తండు ముత్తిలింగం (60) రోజువారీగా సాయంత్రం తన వ్యవసాయబావి వద్ద కల్లు గీసేందుకు టీవీఎస్ మోపెడ్‌పై బయల్దేరాడు. మార్గమధ్యలో వాహనం అదుపుతప్పి కిందపడడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ నరేష్ కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. వాహనం అదుపుతప్పి మృతి చెందినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు ఆయన వెల్లడించారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆర్టీసీ లక్కీడ్రా విజేతలకు బహుమతులు

నల్లగొండ రూరల్: రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించిన ప్రయాణికులకు హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్‌లో శుక్రవారం లక్కీడ్రా నిర్వహించారు. ఇందులో ఎంపికైన ముగ్గురికి ఆర్టీసీ ఎండీ సజ్జనార్ శుక్రవారం నగదు బహుమతులు అందజేశారు. వీరిలో సూర్యాపేట పట్టణానికి చెందిన లీలకు మొదటి బహుమతి కింద రూ.25 వేలు, నిడమనూర్ మండలంలోని ఇండ్ల కోటయ్యగూడేనికి చెందిన శోభకు రెండో బహుమతి కింద రూ.15వేలు, మూడో బహుమతి పొందిన హాలియా సమీపంలోని హజారిగూడేనికి చెందిన వద్దిరెడ్డి శైలజకు రూ.10 వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు.


మొదటి బహుమతి పొందిన లీలకు రూ.25 వేల చెక్కు అందజేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్


రెండో బహుమతి కింద రూ.15వేల చెక్కు అందుకుంటున్న నిడమనూరు మండలం ఇండ్ల కోటయ్యగూడేనికి చెందిన శోభ


మూడో బహుమతి పొందిన హజారిగూడేనికి చెందిన వద్దిరెడ్డి శైలజకు రూ.10 వేల చెక్కు అందజేస్తున్న సజ్జనార్

తాగునీటి ప్రాజెక్టు పనుల్లో ప్రమాదం

- పంప్‌హౌస్‌లో బండరాళ్లు మీదపడి ఒకరు మృతి
- ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలు
- మృతుడిది జార్ఖండ్ రాష్ట్రం

పెద్దవూర: పెద్దవూర మండలంలోని పాల్తీతండా సమీపంలోని సుంకిశాల వద్ద జంటనగరాలకు తాగునీటి సరఫరా కోసం నిర్మిస్తున్న ఇన్‌టేక్‌వెల్ పంపింగ్ స్టేషన్‌లో శుక్రవారం ప్రమాదం జరిగింది. పంప్‌హౌస్ పైన ఉన్న లేయర్(దరి) కూలిన ప్రమాదంలో ఒకరు మృతిచెందగా ఐదుగురు కార్మికులకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ జంటనగరాలకు కృష్ణా జలాల సరఫరా కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.1485 కోట్ల వ్యయంతో సుంకిశాల నుంచి కోదండపురం వరకు 17 కిలోమీటర్ల దూరం 40 అడుగుల వెడల్పులో మూడు పైపులైన్లు, సుంకిశాల వద్ద ఇన్‌టేక్ వెల్ పంపింగ్ స్టేషన్ నిర్మిస్తోంది. నాగార్జునసాగర్ జలాశయంలో నీటి నిల్వ డెడ్‌స్టోరేజీకి చేరుకున్నా.. జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేసేలా మూడు స్టేజీలలో మూడు సొరంగాలను నిర్మిస్తున్నారు. ఇప్పటికే రెండు పూర్తికాగా మూడో సొరంగంలో పంప్‌హౌస్ పనులు జరుగుతున్నాయి. రోజువారి పనులలో భాగంగా శుక్రవారం ఏడుగురు కార్మికులు సొరంగంలోని పంప్‌హౌస్‌లో పిల్లర్ నిర్మాణానికి గాను ఐరన్ రాడ్‌లతో పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలో సొరంగం పైపొర (దరి) నుంచి రాతిపెళ్లలు కూలి పంప్‌హౌస్‌లో పనిచేస్తున్న కార్మికులపై పడ్డాయి. దీంతో


ప్రమాదం జరిగిన ప్రాంతం


మృతుడు కర్మకర్

జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన బికాస్ కర్మకర్(20) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బిహార్ రాష్ట్రానికి చెందిన అజయ్‌ఠాకూర్, రాహుల్‌కుమార్, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రబిమూడి, కార్తీక్ మాలిక్, గత్తు మాలిక్‌లకు తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. బికాస్ కర్మకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సాగర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుని స్నేహితుడు పవన్ సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపారు. గత సంవత్సరం కాంక్రీటు పనులు చేపడుతుండగా సొరంగం పైనుంచి బండరాళ్లు కూలిన ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందాడు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

నూతనకల్: మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన లింగాల ఉప్పలయ్య హత్య కేసులో నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం తెలిపిన వివరాల ప్రకారం.. అన్నదమ్ములైన లింగాల అంజయ్య, లింగాల వెంకటయ్య మధ్య కొన్ని సంవత్సరాలుగా భూ తగాదాలు నడుస్తున్నాయి. పాత కక్షలను దృష్టిలో ఉంచుకొని గ్రామంలో గత నెల 27న నిర్వహించిన ముత్యాలమ్మ పండుగ సందర్భంగా ఆలయం వద్ద వెంకటయ్య కుటుంబ సభ్యులతో పాటు మరికొంత మంది కలిసి అంజయ్య కుటుంబ సభ్యులపై ఇనుప రాడ్లు, కర్రలతో దాడి చేశారు. ఈఘటనలో గాయపడిన ఉప్పలయ్యతో పాటు అంజయ్య కుటుంబ సభ్యులను ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఉప్పలయ్యను హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఈ నెల 5న మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు 13మందిపై కేసు నమోదు చేశారు. ఈమేరకు సూర్యాపేట - దంతాలపల్లి ప్రధాన రహదారిపై ఉన్న గుండ్లసింగారం బ్రిడ్జి వద్ద పోలీసులు వాహన తనిఖీలు


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ నాగభూషణం

చేస్తుండగా పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని పట్టుకొని విచారించగా హత్య కేసులో నిందితులుగా నిర్ధారించారు. హత్యకు కారకులైన లింగాల రవితేజ, లింగాల పృథ్వీ, చిర్ర మహేష్, పవన్, బీసు ఏకస్వామి, లింగాల మంగమ్మ, బీసు మౌనికలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మిగతా ఐదుగురు నిందితులు పరారీలో ఉన్నారు. సమావేశంలో తుంగతుర్తి సీఐ బ్రహ్మమురారీ, ఎస్‌ఐ సీహెచ్ నరేష్, సిబ్బంది వీరబోయిన మల్లయ్య, దాచేపల్లి అరవింద్, వల్లపు నారాయణ, తిరపతయ్య, మామిడి అమృత్, విజయ్, శ్రీనివాస్, అశోక్ తదితరులున్నారు.

యూరియా ఇవ్వాలని రైతుల రాస్తారోకో


పెన్‌పహాడ్‌లో యూరియా కోసం రాస్తారోకో చేస్తున్న రైతులు

- సూర్యాపేట–గరిడేపల్లి ప్రధాన రహదారిపై రైతుల ఆందోళన
- సరిపడా యూరియా సరఫరా చేయాలని డిమాండ్

పెన్‌పహాడ్: సాగు చేసిన పంట పొలాలకు యూరియా ప్రభుత్వం సరఫరా చేయకపోవడాన్ని నిరసిస్తూ పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని సూర్యాపేట–గరిడేపల్లి ప్రధాన రహదారిపై శుక్రవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మండల కేంద్రంలోని చీదెళ్ల సహకార పరపతి సంఘం కార్యాలయానికి యూరియా వచ్చిందన్న సమాచారం మేరకు రైతులు యూరియా కోసం బారులు తీరడంతో వచ్చిన యూరియా రైతులకు సరిపడా అందకపోవడంతో ఆగ్రహించి రాస్తారోకో చేపట్టారు. పంటలను సాగు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ పంటలకు వేయాల్సిన సమయంలో యూరియా వేయకపోవడంతో వాటిలో ఎదుగుదల లేక పంటల దిగుబడిపై ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు సరిపడా యూరియాను సరఫరా చేయాలని కోరారు. ధర్నా విషయాన్ని తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రైతులు, సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు కావాల్సిన యూరియాను త్వరితగతిన సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

ఆల్ ఇండియా క్విజ్ కాంపిటీషన్‌కు నల్లగొండ విద్యార్థులు


కాంపిటీషన్‌కు వెళ్తున్న విద్యార్థులు

నల్లగొండ రూరల్: హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభారతిలో నిర్వహించనున్న యూ జీనియస్ ఆల్ ఇండియా క్విజ్ కాంపిటీషన్- 2023లో పాల్గొనేందుకు నల్లగొండ పట్టణానికి చెందిన పలు పాఠశాలల విద్యార్థులు శుక్రవారం యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో వెళ్లారు. విద్యార్థులను ప్రోత్సహించడంలో భాగంగా బ్యాంక్ ఆధ్వర్యంలో కాంపిటీషన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు యూనియన్ బ్యాంక్ రీజినల్ సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజినల్ హెడ్ శ్రీనివాసమూర్తి, చీఫ్ మేనేజర్ రఘుమయ్య, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తి రిమాండ్

భూదాన్‌పోచంపల్లి: మండలంలోని జిబ్లక్‌పల్లి గ్రామానికి చెందిన చిలుకూరి లక్ష్మమ్మ మెడలో బంగారు గొలుసు చోరీకి యత్నించిన దొంగను పోలీసులు పట్టుకొని రిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని రాచకొండ సీపీ కార్యాలయంలో సీపీ డీఎస్ చౌహాన్ కేసు వివరాలు వెల్లడించారు. చౌటుప్పల్ మండలం గుండ్లబావికి చెందిన చిడుగుల నరేశ్, రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్‌లో ఆర్టీఏ ఏజెంట్ పనిచేస్తున్నాడు. ఇతను కొద్ది రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. అంతేకాకుండా ఆన్‌లైన్‌లో పేకాట ఆడుతూ, క్రికెట్ బెట్టింగ్ పెట్టి రూ.20లక్షల వరకు నష్టపోయాడు. దీంతో అతడి మామతో పాటు, తెలిసిన వారి వద్ద అప్పులు చేసి వాటిని తీర్చలేక ఇబ్బందులు పడుతున్నాడు.

యూట్యూబ్ వీడియోలు చూసి..

అప్పులు తీర్చడానికి సులభంగా డబ్బులు సంపాదించేందుకు దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నాడు. ఇందుకోసం యూట్యూబ్, ఫేస్‌బుక్‌లలో చోరీకి సంబంధించిన పలు వీడియోలు చూశాడు. దీనిని అమలు చేసేందుకు గురువారం బైక్‌పై వచ్చి జిబ్లక్‌పల్లి గ్రామ శివారులో పేడ కోసం నడుచుకుంటూ వెళ్తున్న లక్ష్మమ్మను ఆపి, చిన్నకొండూర్‌కు ఎలా వెళ్లాలని అడిగి ఆమె మెడలో ఉన్న బంగారు గొలుసును అపహరించేందుకు యత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేస్తూ ప్రతిఘటించడంతో అతను దోతిగూడెం మీదుగా కొయ్యలగూడెం వైపు పారిపోయాడు.


వివరాలు వెల్లడిస్తున్న రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్

మొదటి కేసులోనే..

సమాచారం అందుకున్న పోలీసులు అప్రమత్తమై బృందాలుగా ఏర్పడి వాహనాలు తనిఖీ చేపట్టారు. జిబ్లక్‌పల్లి, దోతిగూడెం గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాల్లో పుటేజీలను పరిశీలించారు. అందులో బైక్‌పై వెళ్తున్న నరేష్ బైక్ నంబర్‌ను గుర్తించారు. దీని ద్వారా మొబైల్ నంబర్ తెలుసుకొని ఇతడు ఉన్న లోకేషన్‌ను ట్రేస్ చేశారు. హయత్‌నగర్‌లోని స్వాతి బార్ అండ్ రెస్టారెంట్ ముందు పార్కింగ్ చేసిన ఇతని బైక్ నంబర్‌ను చెక్ చేసుకొన్న పోలీసులు బార్‌లో మద్యం సేవిస్తుండగా పోలీసులు పట్టుకొని అరెస్ట్ చేశారు. కేవలం 6 గంటల్లోనే నిందితుడిని పట్టుకొని అరెస్ట్ చేసిన పోలీసులను సీపీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో డీసీపీ రాజేశ్ చంద్ర, చౌటుప్పల్ ఏసీపీ మొగులయ్య, సీఐ దేవేందర్, ఎస్‌ఐ, ఎస్‌ఐ యాదగిరి, ఏఎస్‌ఐ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వేములపల్లి: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారు అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం గోగువారిగూడేనికి చెందిన మంటిపెల్లి లక్ష్మయ్య, అతని భార్య జానమ్మ ద్విచక్ర వాహనంపై శుక్రవారం ఉదయం మిర్యాలగూడకు వెళ్లారు. తిరిగి మధ్యాహ్నం గోగువారిగూడేనికి వస్తుండగా శెట్టిపాలెం గ్రామ శివారులోని శ్రీలక్ష్మీ మోడ్రన్ రైస్ మిల్లు వద్దకు చేరుకోగానే మిర్యాలగూడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య, జానమ్మలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని చికిత్స నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. లక్ష్మయ్య అన్న మంటిపెల్లి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

అర్వపల్లి: మండల పరిధి లోని పర్సాయపల్లి గ్రామంలో శుక్రవారం కోతుల దాడిలో ఓ వృద్ధురాలు తీవ్రంగా గాయపడింది. గ్రామానికి చెందిన నిమ్మనగోటి యల్లమ్మ ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా కోతులు ఒక్కసారిగా ఆమెపై దాడి చేశాయి. దీంతో కాలుకు తీవ్ర గాయమైంది. గ్రామస్తులు 108 అంబులెన్స్‌లో సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా.. వారం రోజుల క్రితం కోతుల గుంపు ఓ బాలుడిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. కోతుల బెడదను నివారించాలని గ్రామస్తులు అటవీశాఖ, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశారు.


గాయపడిన యల్లమ్మ

భారీగా పేలుడు పదార్థాల పట్టివేత

యాదగిరిగుట్ట రూరల్: యాదగిరిగుట్టలో పోలీసులు శుక్రవారం భారీగా పేలుడు పదార్థాలు పట్టుకున్నారు. రాచకొండ సీపీ చౌహాన్, యాదగిరిగుట్ట పట్టణ సీఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదగిరిగుట్ట పట్టణ పరిధిలోని సన్నిధి హోటల్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో యాదగిరిగుట్ట ప్రాంతానికి చెందిన దుంప వినోద్ బైక్‌పై రాయగిరి నుంచి యాదగిరిగుట్టకు వస్తున్నాడు. అనుమానం వచ్చి అతని బ్యాగ్‌ను తనిఖీ చేయగా 6 జిలెటిన్ స్టిక్స్, 5 డిటోనేటర్‌లు దొరికాయి. దీంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. భువనగిరి మండలం రాయగిరి గ్రామానికి చెందిన శివరాత్రి మహేష్ అనే వ్యక్తి వద్ద ఈ పేలుడు పదార్థాలను తీసుకొచ్చానని తెలిపాడు. ఈమేరకు భువనగిరి పోలీసులు శివరాత్రి మహేష్ ఇంటిని సోదా చేశారు. అతడి ఇంట్లో 239 జిలెటిన్ స్టిక్స్, 666 డిటోనేటర్స్ లభ్యమయ్యాయి. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీపీ పేర్కొన్నారు.

మూడు కిలోల గంజాయి పట్టివేత

చౌటుప్పల్: చౌటుప్పల్‌లోని ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో శుక్రవారం పోలీసులు మూడు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం హైదరాబాద్‌లోని రాచకొండ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ వెల్లడించారు. బిహార్ రాష్ట్రంలోని కతౌడియా గ్రామానికి చెందిన లాలోదాస్ (30) చౌటుప్పల్ మండల పరిధిలోని దేవలమ్మ నాగారం గ్రామంలో ఉన్న ఓ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వెళ్లాడు. అక్కడ తను సాగు చేస్తున్న గంజాయిని మూడు కిలోలు బస్తాలో వేసుకొని స్వగ్రామం నుంచి రైలులో బయలుదేరి గురువారం రాత్రి సికింద్రాబాద్ చేరుకున్నాడు. అక్కడి నుంచి ఆర్టీసీ బస్సులో చౌటుప్పల్‌కు వచ్చాడు. అప్పటికే అర్ధరాత్రి కావడంతో దేవలమ్మనాగారం గ్రామానికి ఎలాంటి బస్సు, ఇతర ప్రైవేట్ వాహనాల సౌకర్యం లేకపోవడంతో అక్కడే బస్‌స్టేషన్‌లోనే పడుకున్నాడు. ఈ క్రమంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు బస్‌స్టేషన్‌కు వెళ్లారు. అనుమానాస్పదంగా కనిపించడంతో దగ్గరకు వెళ్లి తనిఖీ చేయగా.. అతడి వెంట ఉన్న బస్తాలో మూడు కిలోల గంజాయిని గుర్తించారు. దానిని స్వాధీనం చేసుకొని లాలోదాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక కోర్టులో రిమాండ్ చేసి అనంతరం జైలుకు తరలించారు.

కేసీఆర్ మాటలకు, చేతలకు పొంతన ఉండదు

- ఎన్నికలకు ముందే దళిత, గిరిజనులు గుర్తొస్తారు
- బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



బీజేపీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

దేవరకొండ: ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలకు, చేతలకు పొంతన ఉండదని, ఎన్నికలకు ముందు మాత్రమే ఆయనకు దళితులు, గిరిజనులు గుర్తుకొస్తారని బీజేపీ నేత, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. నల్లగొండ జిల్లా దేవరకొండ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన బీజేపీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గ్రామాల్లో ఉపాధి కరువై ఎంతో మంది నిరుపేదలు పట్టణాలకు వలసలు వెళ్తున్నారని అన్నారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. గిరిజనులకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏం చేసిందని ఆయన ప్రశ్నించారు. గ్రామాల్లో కల్తీ మద్యం ఏరులై పారుతోందని ఎంతో మంది మద్యం సేవించి అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. సారా సీసలు అమ్మి రూ.45వేల కోట్లు కేసీఆర్ సొమ్ము చేసుకొన్నాడని, అందులో నుంచి వివిధ పథకాలకు రూ.25వేల కోట్లు మంజూరు చేస్తున్నాడని ఈటల ఆరోపించారు. దేవరకొండ నియోజకవర్గంలోని ఎస్‌ఎల్‌బీసీ సొరంగ మార్గానికి వెంటనే నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పేదలకు 3.5కోట్ల ఇళ్లు కట్టించిన ఘనత ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వానిదని తెలిపారు. దేవరకొండ నియోజకవర్గంలో పార్టీ కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆయా సంఘాలు, పార్టీల నాయకులు ఈటలను ఘనంగా సన్మానించారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఏటీ కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి, చింతా సాంబమూర్తి, గరికపాటి రామ్మోహన్‌రావు, కర్నాటి సురేష్, గార్లపాటి జితేందర్, శ్రీశైలంగౌడ్, కేతావత్ లాలునాయక్, తూటుపల్లి రవి, కళ్యాణ్‌నాయక్, అంకూరి నర్సింహ, కంకణాల నివేదిత, నీల రవి, గుండాల అంజయ్య, ఏటి రాధిక, గాజుల మురళి, పులిజాల లక్ష్మీ, జల్దా భాస్కర్ పాల్గొన్నారు.

మిస్టరీగా మారిన ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్య

- కాల్ డేటా, ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టింగ్, డిలీటెడ్ డేటా ఆధారంగా దర్యాప్తు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు మనీష, శివానీల ఆత్మహత్య మిస్టరీని తేల్చేందుకు పోలీసులు సాంకేతికంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా ఒకరు బ్లాక్ మెయిల్ చేస్తున్నాడని చెప్పిన ఫోన్ కాల్ రికార్డును జడ్జి ఎదుట వాంగ్మూలం ఇవ్వడంతో పట్టణ టూటౌన్ పోలీసులు ఆ ఇద్దరి విద్యార్థినుల ఫోన్‌లను క్షుణంగా పరిశీలిస్తున్నారు. కాల్ డేటా ఆధారంగా ఎవరితో ఎక్కువగా మాట్లాడారో వారిని గుర్తించిన పోలీసులు ఇప్పటికే 8 మందిని విచారించారు. ఇన్‌స్టాగామ్‌లో పోస్టు చేసిన, డిలీటెడ్ డేటాను రాబట్టి అసలు ఆత్మహత్యకు కారణమైన వారిని పట్టుకునేందుకు సాంకేతిక విభాగంలో డీజీపీ స్థాయి అధికారులు కేసును పరిశీలిస్తున్నట్లు పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. మరో రెండు రోజుల్లో ఇన్‌స్టాగ్రామ్ డేటాను పూర్తిగా పరిశీలించి అసలు నిందితులను పట్టుకోనున్నట్లు సమాచారం. కాగా.. కేసులో కొన్ని రోజులు జాప్యం జరిగినా ఆత్మహత్యకు కారణమైన వారు సాంకేతికంగా తప్పించుకోలేరని టూటౌన్ ఎస్సై నాగరాజు తెలిపారు.

క్లుప్తంగా

ఆర్డీఓ కార్యాలయానికి భవనం పరిశీలన

చండూరు : చండూరులో ఆర్డీఓ కార్యాలయం ఏర్పాటుకు గుండ్రపల్లి రోడ్డులో ఎంపీడీఓ కార్యాలయానికి సమీపంలో గతంలో నిర్మించిన స్త్రీశక్తి భవనాన్ని నల్లగొండ ఆర్డీఓ రవి శుక్రవారం పరిశీలించారు. ఆ భవనానికి తాత్కాలిక మరమ్మతులు చేయాలని తహసీల్దారు రవీందర్‌రెడ్డికి ఆర్డీఓ సూచించారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు (ఎలక్షన్) దీపక్ తదితరులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

చండూరు : మండలంలోని పుల్లెంల గ్రామ గీత కార్మిక సొసైటీ నూతన కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయపల్లి శంకరయ్యగౌడ్, ఉపాధ్యక్షులుగా గండు కేశవులుగౌడ్, కార్యదర్శులుగా పాలకూరి దయనంద్‌గౌడ్, బొడ్డు హరికృష్ణగౌడ్, డైరెక్టర్లుగా నకిరేకంటి లింగస్వామిగౌడ్, పాలకూరి భిక్షమయ్యగౌడ్, పాలకూరి సైదులుగౌడ్, బోయపల్లి శంకరయ్యగౌడ్, బోయపల్లి నర్సింహగౌడ్ ఎన్నికయ్యారు.

సేవాదళ్ అధ్యక్షుడిగా మహ్మద్ అబ్బాస్



చండూరు(గట్టుప్పల్) : కాంగ్రెస్ సేవాదళ్ కమిటీ గట్టుప్పల్ మండల అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మహ్మద్ అబ్బాస్ నియమితులయ్యారు. సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బరిగెల ధర్మయ్య శుక్రవారం అబ్బాస్‌కు నియామకపత్రం అందజేశారు.

బెల్ట్‌షాపులను మూసివేయించాలని వినతి

నల్లగొండ టూటౌన్, చిట్యాల : జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా ఉన్న బెల్ట్ షాపులను తక్షణమే మూసివేయించాలని కోరుతూ యువ సంఘర్షణ ఫౌండేషన్ అధ్యక్షుడు అనుమోజు రామాచారి శుక్రవారం కలెక్టర్ ఆర్.వి. కర్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. బెల్ట్ షాపులకు మద్యం సరఫరా చేసే వైన్స్ దుకాణాలపై కేసులు నమోదు చేయాలని కోరారు. బెల్ట్ షాపుల వల్ల ప్రతి గ్రామంలో పలు కుటుంబాలు రోడ్డున పడి పిల్లలు అనాథలవుతున్నారని, మహిళలు యుక్త వయసులోనే భర్తలను కోల్పోతున్నారని వివరించారు.

గొర్రెల పంపిణీ



గొర్రెలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ కళ్యాణి

చండూరు : యాదవుల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ పల్లె కళ్యాణి అన్నారు. శుక్రవారం గట్టుప్పల్‌లో 11, కొండాపురంలో 24 యూనిట్ల గొర్రెలను లబ్ధిదారులకు ఎంపీపీ పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్ బాలకృష్ణ, కొండాపురం సర్పంచ్ బరిగెల యాదమ్మ, బీఆర్ఎస్ నాయకుడు వెంకటేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

బీసీ సింహగర్జన జయప్రదం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నార్కట్‌పల్లి : ఈ నెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న బీసీల సింహగర్జన సభను జయప్రదం చేయాలని బీసీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నర్సింహ, మండల అధ్యక్షుడు ముద్దం నరసింహ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సింహగర్జన సభకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. పుల్లెంల అచ్చాలు, శ్రీనివాస్, చెన్నారపు సత్తయ్య, ప్రజ్ఞాపురం శ్రీను, బోయపల్లి శ్రీనివాస్, కొప్పు నాగరాజు, వల్కి శంకర్, స్వామి, మట్టిపల్లి శ్రీను, తెలుసూరి నర్సింహ, సైదులు, వడ్డగోని రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

నార్కట్‌పల్లి : విద్యుదాఘాతానికి గురై గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని తిరుమలగిరి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన బోడ శ్రీనివాస్ తన పాడి గేదెను రోజువారీగా శుక్రవారం మేత కోసం వ్యవసాయ పొలం వద్దకు తోలుకుని పోతుండగా ప్రమాదశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ సమీపాన ఉన్న మెయిన్ విద్యుత్ తీగ గేదెకు తగలడంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే గేదె మృతి చెందిందని, తనకు న్యాయం చేయాలని బాధితుడు కోరారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు

శాలిగౌరారం: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల ఎదుట ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు.

వేధిస్తున్న యూరియా కొరత

- నరిపడా లేని సరఫరా
- దుకాణాల చుట్టూ తిరుగుతున్న రైతులు



యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

మునుగోడు : వానాకాలం సీజన్‌లో పంటలు సాగు చేసిన మునుగోడు మండలంలోని రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారు. 10 రోజుల క్రితం వరకు వర్షాలు కురవకపోవడంతో రైతన్నలు తమ పంటలకు ఎలాంటి ఎరువులు వేయలేదు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో పంటల ఎదుగుదలకు అవసరమైన కాంప్లెక్స్ ఎరువులను వేసేందుకు సిద్ధమయ్యారు. కానీ యూరియా ఫర్టిలైజర్ దుకాణాల్లో అందుబాటులో లేకపోవడంతో రైతులు దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

49,200 ఎకరాల్లో పంటలు సాగు..

మునుగోడు మండలవ్యాప్తంగా 58 వేల ఎకరాల భూమి ఉండగా అందులో 49,200 ఎకరాల్లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేశారు. 40,250 ఎకరాల్లో పత్తి, 7వేల ఎకరాల్లో వరి, 1500 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేశారు. ఆ పంటలకు కాంప్లెక్స్ ఎరువులతోపాటు యూరియా వేయాల్సి ఉంది. ఫర్టిలైజర్ దుకాణాల్లో కేవలం కాంప్లెక్స్ ఎరువులు మాత్రమే లభిస్తున్నాయి. యూరియా లేకపోవడంతో తిరిగి ఇంటి బాట పడుతున్నారు. కొన్ని దుకాణాలకు అడపాదడపా సరఫరా అవుతున్నప్పటికీ కేవలం కొందరు రైతులకు మాత్రమే సరిపోతోంది.

1650 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా

మునుగోడు మండల వ్యాప్తంగా దాదాపు 20 వేల మంది రైతులు ఈ ఏడాది 49,200 ఎకరాల్లో పంటలు సాగు చేశారు. ఒక్కో ఎకరానికి 3 బస్తాల చొప్పున మొత్తం 6500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. మండలంలో మొత్తం 32 ఫర్టిలైజర్ దుకాణాలు ఉండగా వాటిలో 18 మంది వ్యాపారులు మాత్రమే ఎరువుల తోపాటు యూరియా తీసుకొచ్చి రైతులకు విక్రయిస్తున్నారు. ఆ 18 దుకాణాలకు ఇప్పటివరకు 1650 మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా అయింది. మిగిలిన యూరియాలో కనీసం సగం వచ్చినా యూరియా కొరత అంతగా ఉండేది కాదని రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని సరిపడా యూరియా అందించాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు విన్నవించాం



యూరియా సరిపడా సరఫరా చేయాలని ఉన్నతాధికారులకు విన్నవించాం. వర్షాలు కురవడంతో రైతులంతా ఒకే సారి యూరియ కోసం వస్తున్నారు. శుక్రవారం రోజు 5 లారీలకు పైగా సరఫరా చేయాలని అధికారులను కోరాం. ఇప్పటివరకు ప్రభుత్వం కొన్ని దుకాణాలకు మాత్రమే యూరియా సరఫరా చేసింది. అన్ని దుకాణాలకు సరఫరా చేసేలా ప్రణాళిక సిద్ధం చేశాం.

– ఎస్. శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయ అధికారి మునుగోడు

మూడు రోజులుగా తిరుగుతున్నా



నేను ఈ ఏడాది 20 ఎకరాల్లో పత్తి పంట సాగు చేశా. పత్తికి ఎరువులు పెట్టేందుకు ఫర్టిలైజర్ దుకాణానికి వెళ్తే కేవలం కాంప్లెక్స్ ఎరువులు మాత్రమే ఉన్నాయి, యూరియా లేదని చెబుతున్నారు. యూరియా కోసం మూడు రోజులుగా దుకాణాల చుట్టూ తిరుగుతున్నా. కానీ నాకు ఇప్పటి వరకు యూరియా దొరకలేదు.

– వంగూరి చంద్రయ్య, రైతు చొల్లేడు

సబ్బండ వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : సబ్బండ వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. నకిరేకల్ మండలం చందుపట్ల శివారులోని మారుతి నగర్‌లో ముదిరాజ్ సంఘానికి చెందిన 100 కుటుంబాలు శుక్రవారం ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయినేజీ పనులు, ఆలయానికి ప్రహరీ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరినవారిలో సంద్ర నగేష్, సంద్ర రాంచంద్రు, నరేష్, కోరివి ఆంజనేయులు, మేడవరపు ఆంజనేయులు, కొప్పు సతీష్‌తోపాటు మరి కొంతమంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహేందర్‌రెడ్డి, స్థానిక ఎంపీటీసీ ఇమడపాక లక్ష్మీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లిని రెవెన్యూ డివిజన్ చేయాలి



రాస్తారోకో చేస్తున్న అఖిలపక్ష నేతలు

నాంపల్లి : పాత తాలూకా కేంద్రమైన నాంపల్లిని రెవెన్యూ డివిజన్ చేయాలని, లేకుంటే దేవరకొండ డివిజన్‌లో కొనసాగించాలని అఖిలపక్ష నేతలు డిమాండ్ చేశారు. శుక్రవారం కళాశాల, పాఠశాలల విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలోని ప్రధాన వీధుల వెంట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాంపల్లి మండల ప్రజాప్రతినిధులకు చిత్తశుద్ధి ఉంటే డివిజన్ కోసం వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, తెలంగాణ అమరవీరుల ఆశయాల సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కోరె సాయిరాం, కాంగ్రెస్ నాయకులు గాదెపాక వేలాద్రి, సీపీఐ మండల సహాయ కార్యదర్శి ఊరుపాక వెంకటయ్య, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాంపల్లి సంజీవ, గడ్డం శ్రీను, ఎదుళ్ల కోటేష్, బీఎస్పీ మండల అధ్యక్షుడు పల్లేటి వినోద్‌కుమార్, కోనేటి సాయికుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



నల్లగొండ పట్టణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం చేస్తున్న మహిళలు



రామకోటి ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు



చిట్యాల: దుర్గామాత విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దంపతులు

రామగిరి(నల్లగొండ): శ్రావణ శుక్రవారం సందర్భంగా పట్టణంలోని బీట్ మార్కెట్‌లో గల శ్రీ వాసవీమాత శ్రీ ఉమామహేశ్వరస్వామి సహిత శ్రీ రామకోటి స్తూప ఆలయంలో వాసవీమాత అమ్మవారికి 108 మట్టి కలశాలతో కలశ పూజ నిర్వహించారు. భక్తులు ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర పూజలు, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వర్షిత్‌రెడ్డి, డాక్టర్ కొత్తనూరు సోంబాబు, ఆలయ కమిటీ సభ్యులు బండారు వెంకటేశ్వర్లు, అర్రూరు సత్యనారాయణ, గుడిపాటి సత్యనారాయణ, శివకోటి నెహ్రూ, కుక్కడపు శ్రీనివాస్, వనమా మనోహర్ పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

రామగిరి(నల్లగొండ): శ్రావణమాసం సందర్భంగా శుక్రవారం నల్లగొండ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ స్కూల్‌లో సామూహిక వరలక్ష్మి వ్రత పూజలు నిర్వహించారు. విద్యార్థుల కుటుంబ సభ్యులు పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దోసపాటి శ్రీనివాస్, మిట్టపల్లి రాజేందర్, తిరందాసు లక్ష్మీనారాయణ, చిలుకూరి పరమాత్మ, ఎడ్ల తిరమలేష్, నన్నూరి రాంరెడ్డి, కొండ నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు

చిట్యాల: శ్రావణమాసం నాలుగో శుక్రవారం సందర్భంగా చిట్యాల పట్టణంలోని శ్రీ కనకదుర్గ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గామాత ఉత్సవ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, ఆలయ మేనేజర్ అంబటి నాగిరెడ్డి, ఆలయ చైర్మన్ శీలా సత్యనారాయణ, ఆలయ డైరెక్టర్లు, భక్తులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఆర్డీఓ రవికుకుమార్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో శుక్రవారం ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండినవారు తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు ఉన్న ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు నాగులవేణు, డాక్టర్ ఎస్.యాదగిరి, యాదగిరిరెడ్డి, గంజి భాగ్యలక్ష్మి, శివరాణి, అధ్యాపకులు సీతారామ్ రాథోడ్, లైబ్రేరియన్ డాక్టర్ దుర్గా ప్రసాద్, పీడీ మల్లేష్, డాక్టర్ కృష్ణ కౌండిన్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ చెక్కులు అందజేత



చెక్కులు అందజేస్తున్న చైర్మన్ నర్సిరెడ్డి

నాంపల్లి : సహకార బ్యాంక్ రుణాలు తీసుకున్న రైతులకు రుణమాఫీ కావడంతో ఆ బ్యాంక్ చైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి శుక్రవారం రైతులకు రుణమాఫీ చెక్కులు అందజేశారు. బ్యాంక్‌లో అర్హత కలిగిన 317 మంది రైతులు ఉంటే వారిలో 156 మంది రైతులకు చెక్కులు వచ్చాయని చైర్మన్ తెలిపారు. మిగత రైతులకు త్వరలోనే రుణమాఫీ చెక్కులు వస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గిరి, వెంకటయ్య, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

ప్రతిరోజు ఉచిత షుగర్ పరీక్షలు

నకిరేకల్ : లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిరోజు నిర్వహించబోయే ఉచిత షుగర్ పరీక్ష కేంద్రాన్ని నకిరేకల్‌లోని వెంకటరమణ వైద్యశాలలో డాక్టర్ వీరబ్రహ్మం శుక్రవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో ప్రతిరోజు ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు ఉచితంగా షుగర్ పరీక్షలు చేస్తారని క్లబ్ అధ్యక్షుడు ఉప్పల వెంకటరమణ తెలిపారు. క్లబ్ ప్రతినిధులు బొల్లం కృష్ణమూర్తి, నెమరుగోమ్మల రాంమోహన్‌రావు, వరకాంతం నారాయణరెడ్డి, పాల్గొన్నారు.



షుగర్ పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీరబ్రహ్మం

'బీసీలను మోసం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వం'

మర్రిగూడ : రాష్ట్రంలో 54 శాతం ఉన్న బీసీలను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర మీడియా సెల్ కన్వీనర్ పిట్టల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం బీసీలకు రాజకీయ పార్టీలు సరైన ప్రాతినిధ్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో వెంకటంపేట బాలయ్య, బీజేపీ దళితమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గ్యార గోపాల్, మండల కార్యదర్శి మామిడి పరుశురాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి సాయుధ పోరాట వారోత్సవాలు

కట్టంగూర్ : ఈ నెల 11 నుంచి 17 వరకు సీపీఎం ఆధ్వర్యంలో నియోజకవర్గంలో నిర్వహించే తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కట్టంగూర్‌లో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి పెంజర్ల సైదులు, చిలుముల రామస్వామి, కక్కిరేణి రామస్వామి, ఊట్కూరి యాదయ్య, జాల రమేష్, గడగోజు రవీంద్రాచారి, ఇటికల సురేందర్, దుప్పెల్లి నాగయ్య, మురారి మోహన్ ఉన్నారు.

విద్యుత్ పోరాట అమరుడికి నివాళి

చిట్యాల: విద్యుత్ పోరాటంలో అమరుడైన సత్తెనపల్లి రామకృష్ణకు చిట్యాలలో శుక్రవారం సీపీఎం, రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, రుద్రారపు పెద్దులు, అక్కెనపల్లి నాగయ్య, శీలా రాజయ్య, గుడిసె లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి



నినాదాలు చేస్తున్న అఖిలపక్ష నేతలు

మునుగోడు : మునుగోడును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ అఖిలపక్ష నేతలు శుక్రవారం మునుగోడు మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మునుగోడుపై ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి సవతి తల్లి ప్రేమ చూపుతున్నారని అన్నారు. మునుగోడుపై ఎమ్మెల్యే వైఖరి చెప్పాలని, లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వల్ల యాదయ్య, తోట నర్సింహాచారి, పందుల సురేష్, మందుల సైదులు, ముచ్చపోతుల నర్సింహ, నక్క వెంకన్న, ఉప్పునూతల లింగస్వామి, జక్కలి ముత్యాలు, గోవర్ధన్‌యాదవ్, జడిగం సతీష్, పులకరం శివ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



కట్టంగూర్ : నారాయణను సన్మానిస్తున్న సర్పంచ్ సరిత, ఎంఈఓ



గట్టుప్పలలో ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎంపీపీ కళ్యాణి, జెడ్పీటీసీ వెంకటేశం

కట్టంగూర్ : జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మండలంలోని గార్లబాయిగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సముద్రాల నారాయణను శుక్రవారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోడ సరిత, ఎంఈఓ మేక నాగయ్య, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కొండ శంకర్, గౌరవ అధ్యక్షుడు జి వీరుగౌడ్, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కృష్ణ, వీరయ్య, హెచ్ఎం ఎన్ వెంకటేశం, ఉపాధ్యాయులు సునిత, జ్యోతి, అనిత, శిరీష, మమత, పాల్వాయి లింగారెడ్డి పాల్గొన్నారు.

చండూరు(గట్టుప్పల్) : గట్టుప్పల్ మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని శుక్రవారం మండల కేంద్రంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చండూరు ఎంపీపీ పల్లె కళ్యాణిరవికుమార్, జెడ్పీటీసీ కర్నాటి వెంకటేశం, తహసీల్దారు లావణ్య, ఎంఈఓ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ నది



గురుజాల-మానాయికుంట గ్రామాల మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న మూసీ

శాలిగౌరారం: మూడు రోజులుగా మండలంలో స్వల్పంగా వర్షాలు కురవడంతోపాటు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండడంతో మండల సరిహద్దు వెంట ఉన్న మూసీ నది సుమారు నాలుగు మీటర్ల నీటి మట్టంతో ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో మండలంలోని ఉప్పలంచ, మనిమద్దె, గురుజాల, తుడిమిడి, చిత్తలూరు, వంగమర్తి, ఇటుకులపహాడ్ గ్రామాల్లో నదీ అంచున ఉన్న వరి పంట భూములు నీట మునిగాయి. అదేవిధంగా రైతుల వ్యవసాయ విద్యుత్ మోటార్లు మునిగిపోయి పైపులైన్లు నదీ ప్రవాహంలో కొట్టుకుపోయాయి. కొంతమంది రైతులు విద్యుత్ మోటార్లను ఒడ్డుకు చేర్చుకున్నప్పటికీ పైపులైన్లు మాత్రం ధ్వంసమయ్యాయి. చిత్తలూరు-లక్ష్మీదేవి కాల్వ, మనిమద్దె-డి రేపాక, గురుజాల-వెల్దేవి గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు గురుజాల-మానాయికుంట, వంగమర్తి-జాజిరెడ్డిగూడెం గ్రామాల మధ్య నదిపై నిర్మించిన బ్రిడ్జిలపై నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు.

ఘనంగా బోనాల వేడుకలు



చిట్యాల : బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

చిట్యాల : పట్టణంలోని యాదవ కులస్తులు పెద్దమ్మతల్లి, చౌడమ్మతల్లి బోనాల పండగను శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పలు వార్డుల్లోని మహిళలు బోనాలతో శ్రీకనకదుర్గ ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం అక్కడినుంచి డప్పుచప్పుళ్లు, వాయిద్యాల మధ్య ఊరేగింపుగా బోనాలతో పెద్దమ్మతల్లి, చౌడమ్మతల్లి ఆలయాల వద్దకు చేరుకుని బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం ప్రజాప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

మర్రిగూడలో ఊర బోనాలు

మర్రిగూడ : శ్రావణమాసం చివరి శుక్రవారం సందర్భంగా మండల కేంద్రంలో ఊర బోనాలు ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా తయారు చేసిన నైవేద్యాన్ని గ్రామ దేవత ముత్యాలమ్మకు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్ల యాదయ్య, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, ఉప సర్పంచ్ గౌరె అలివేలునర్సింహ, అర్చకులు లోక వెంకటశర్మ, వార్డు మెంబర్లు పగడాల రఘు, యాదయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థలాల పరిశీలన

చిట్యాల: పట్టణంలో మండల గౌడ సంక్షేమ సంఘం భవనం, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం భవనాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కేటాయించిన స్థలాలను శుక్రవారం చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ద్వారా అందిన స్థల ధృవీకరణ పత్రాలను ఆయా సంఘాల బాధ్యులకు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, పీఆర్ ఏఈ శంకర్‌బాబు, ఆర్ఐ మల్లికార్జున్, సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పానుగోటి హనుమంతరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు డీ ఎస్ఎన్.చారి, మండల అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధానకార్యదర్శి రామలింగస్వామి పాల్గొన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

చండూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం మండల కార్యదర్శి మొగుదాల వెంకటేశం, సహాయ కార్యదర్శి జెర్రిపోతుల ధనుంజయగౌడ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం చండూరు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. చిట్టిమల్ల లింగయ్య, సైదులు, నల్లగంటి లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

10న చాకలి ఐలమ్మ వర్ధంతి

మునుగోడు : ఈ నెల 10వ తేదీన నిర్వహించనున్న చాకలి ఐలమ్మ వర్ధంతిని జయప్రదం చేయాలని రజక హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు పగిళ్ల సత్యం కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అన్ని గ్రామాల్లో రజక సంఘాల ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు బూతరాజు సత్తయ్య, రేవల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే కిశోర్ పరామర్శ

శాలిగౌరారం: మండలంలోని పెర్కకొండారం ఆ గ్రామానికి చెందిన పలువురిని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ శుక్రవారం పరామర్శించారు. పితృవియోగానికి గురైన బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు దుబ్బ వెంకన్నను పరామర్శించారు. శెగ్గెం శంకర్ తల్లి శెగ్గెం సత్తమ్మ మృతి చెందడంతో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన ఎంపీటీసీ భీమనబోయిన పుష్ప భర్త భద్రయ్యను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, చాడ హతీష్‌రెడ్డి, కట్ట వెంకట్‌రెడ్డి, నూక సత్తయ్య, మామిడి సర్వయ్య తదితరులు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

నకిరేకల్ : మండలంలోని తాటికల్ శివారులో హైవేపై కూల్ డ్రింక్స్‌తో వెళ్తున్న వాహనానికి త్రుటిలో ప్రమాదం తప్పింది. వివరాలు.. మినీ వాహనం కూల్ డ్రింక్స్‌తో నల్లగొండ నుంచి నకిరేకల్ వైపు వెళ్తుండగా నకిరేకల్ మండలం తాటికల్ శివారులోని జమాయిల్ తోట దగ్గరకు రాగానే టైర్ పంక్చర్ అయింది. దీంతో ఆ వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి పక్కకు పడిపోయింది. ఈ ఘటనలో ఎవ్వరికీ ప్రమాదం జరగలేదు.

11 నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

నకిరేకల్ : ఈ నెల 11, 12 తేదీల్లో నకిరేకల్‌లోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల మండల స్థాయి బాలబాలికల అండర్-14, అండర్-17 విభాగాల కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ మేకల నాగయ్య శుక్రవారం తెలిపారు. 11న బాలికల, 12న బాలుర సెలక్షన్ ఉంటాయన్నారు. ప్రతి క్రీడా విభాగానికి పాఠశాలల నుంచి ప్రతిభ గల క్రీడాకారులను ముగ్గురు చొప్పున బాలబాలికలను పంపించాలని వివరించారు. వివరాలకు మండల స్థాయి క్రీడల కన్వీనర్, వ్యాయామ ఉపాధ్యాయుడు చింతకాయల పుల్లయ్య సెల్ నంబర్ 9705794159 సంప్రదించాలని కోరారు.

కట్టంగూర్ మండలంలో...

కట్టంగూర్ : మండలంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 11న కట్టంగూర్ హైస్కూల్‌లో మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు ఎంఈఓ మేక నాగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14 విభాగంలో పాల్గొనే బాలబాలికలు జనవరి 1, 2010 తర్వాత పుట్టినవారు, అండర్-17 విభాగంలో పాల్గొనే విద్యార్థులు జనవరి 01, 2007 తర్వాత పుట్టిన వారు క్రీడల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులు పాఠశాల హెచ్‌ఎం నుంచి పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం తీసుకు రావాలన్నారు.

మునుగోడు పీహెచ్‌సీలో ఉద్యోగుల మధ్య తగవులు !

మునుగోడు: అనారోగ్యానికి గురై ఆస్పత్రికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన మందులు ఇవ్వాల్సిన మునుగోడు వైద్య సిబ్బంది.. తమ బాధ్యతలు మరిచి అంతర్గతంగా తగవులు పడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఆస్పత్రిలో పనిచేసే ఇద్దరు సూపర్‌వైజర్ అధికారులు ఇతరుల విధుల్లో జోక్యం చేసుకుంటూ నిత్యం సూటిపోటీ మాటలతో అవహేళన చేస్తున్నట్లు తెలిసింది. గతంలో ఇద్దరు వైద్యులు మాత్రమే ఉండేవారని, ఇప్పుడు ముగ్గురు వైద్యులు ఎందుకని వారితో సన్నిహితంగా ఉండే వారితో జిల్లా అధికారులకు ఫోన్‌లు చేయించి ఒక వైద్యుడిని మరోచోటుకు బదిలీ చేయాలని పదేపదే చెప్పిస్తున్నట్లు సమాచారం. ఈ విషయం స్థానిక ఎంపీపీ, ఇతర నాయకులకు తెలిసి వైద్యులను ఎక్కడికి బదిలీ చేయవద్దని జిల్లా అధికారులకు విన్నవించినట్లు తెలిసింది. స్థానిక ఎమ్మెల్యేకు ఆస్పత్రిలోని అంతర్గత తగాదాల విషయం తెలిసి ఈ విషయమై ఆరా తీస్తున్నట్లు సమాచారం.